## బైజూస్ వ్యవస్థాపకుడు రవీంద్రన్‌కు జైలు శిక్ష



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** ఎడ్‌టెక్ రంగంలో ఒకప్పుడు వెలుగువెలిగిన 'బైజూస్' సంస్థ వ్యవస్థాపకుడు రవీంద్రన్‌కు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. కోర్టు ధిక్కార కేసులో ఆయనకు సింగపూర్ కోర్టు ఆరు నెలల జైలు శిక్ష విధించినట్లు బ్లూమ్‌బర్గ్ నివేదించింది. ఏప్రిల్ 2024 నుంచి తన ఆస్తులకు సంబంధించి కోర్టు ఇచ్చిన పలు ఆదేశాలను పాటించకపోవడంతో రవీంద్రన్‌ను దోషిగా తేలుస్తూ కోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. జైలు శిక్షతో పాటు, అధికారుల ముందు లొంగిపోవాలని, సుమారు రూ. 58 లక్షల కోర్టు ఖర్చులు చెల్లించాలని ఆదేశించింది. అయితే ఈ తీర్పుపై బైజూ రవీంద్రన్ స్పందిస్తూ.. ఇది తప్పుడు , ఏకపక్ష నిర్ణయమని, దీనిని ఊరికే వదిలిపెట్టబోమని ప్రకటించారు.


AKSHARA TODAY

# అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

WWW.AKSHARATODAYNEWS.COM


## బెంగళూరులో ఎబోలా కలకలం..



**అక్షరటుడే, బెంగళూరు:** బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయానికి ఉగాండా వచ్చిన ఓ మహిళను ఐసోలేషన్‌కు తరలించారు. ఎబోలా వైరస్‌పై డబ్ల్యూహెచ్‌వో హెచ్చరికల నేపథ్యంలో ప్రజల భద్రత దృష్ట్యా ఆరోగ్య అధికారులు ముందుజాగ్రత్త చర్యలు చేపట్టారు. సదరు మహిళకు తేలికపాటి లక్షణాలు కనిపించడంతో అధికారులు ఎబోలా పరీక్ష కోసం ఆమె నమూనాలను సేకరించారు. ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ (ఎన్‌ఐవీ)కి పంపినట్లు, నివేదికల కోసం వేచి ఉన్నామని అక్కడి అధికారులు తెలిపారు.


27-5-2026 (Wednesday) MAIN EDITION


## నడిరోడ్డుపై మంటల్లో కాలిపోయిన ఆటో

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నడిరోడ్డుపై ఓ ఆటో మంటల్లో కాలిపోయింది. యూపీలోని అయోధ్యలో గల లతా మంగేష్కర్ చౌక్ వద్ద భక్తులతో వెళుతున్న సీఎన్‌జీ ఆటోరిక్షాలో ఉదయం మంటలు చెలరేగాయి. దీంతో ఆటోలోని వారు వెంటనే బయటపడ్డారు. ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదు. కాగా.. ఆటో మంటల్లో పూర్తిగా కాలిపోయింది.



## నీట్ పేపర్ లీక్ కేసులో ఇద్దరు అరెస్టు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** నీట్ యూజీ 2026 పరీక్ష పేపర్ లీక్ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో సీబీఐ మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేసింది. దీంతో అరెస్టయిన వారి సంఖ్య మొత్తం 13కి చేరింది. కేసులోని కుట్రతో పాటు దాని వెనుక ఉన్న గొలుసుకట్టు సంబంధాలను వెలికితీసేందుకు దర్యాప్తు కొనసాగుతోంది.



## హైడ్రోజన్ డెమూ రైలు ప్రారంభానికి ఆమోదం

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశంలోనే మొట్టమొదటి హైడ్రోజన్ ఆధారిత 10 కోచ్‌ల (డీజిల్-ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్) డెమూ రైలు ప్రారంభానికి రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ రైలు.. హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్స్‌తో ప్రయాణిస్తుంది. ఇది నార్తర్న్ రైల్వేలోని జింద్ – సోనిపట్ సెక్షన్ మధ్య గంటకు 75 కిలోమీటర్ల గరిష్ట వేగంతో ప్రయాణించనుంది.



## కేరళ మాజీ సీఎం నివాసాల్లో ఈడీ దాడులు



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటైల్ లిమిటెడ్ కేసులో మాజీ సీఎం, ప్రస్తుత ప్రతిపక్ష నాయకుడు పినరయి విజయన్ నివాసాలతో సహా కేరళలోని పలు ప్రాంతాల్లో ఈడీ సోదాలు నిర్వహిస్తోంది. ఈడీ అధికారులు బుధవారం ఉదయం కన్నూర్, తిరువనంతపురంలోని పినరాయి విజయన్ ఇళ్లపై సోదాలు నిర్వహించారు. ఆయన కుమార్తె, మాజీ ఐటీ కన్సల్టెంట్ అయిన టి.వీణకు చెందిన, ప్రస్తుతం మూసివేయబడిన 'ఎక్సాలాజిక్' సంస్థ, 20172021 మధ్య కాలంలో ఎలాంటి ప్రత్యక్ష సేవలు అందించకుండానే, ఒక ప్రైవేట్ మైనింగ్ కంపెనీ అయిన సీఎంఆర్‌ఎల్ నుంచి భారీ మొత్తంలో నెలవారీ రిటైనర్లను పొందిందా లేదా అనే విషయంపై చాలాకాలంగా జరుగుతున్న విచారణలో ఇది ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు.

### తీవ్ర ఉద్రిక్తత

పినరై విజయన్ ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టగా.. సీపీఎం కార్య కర్తలు ఆగ్రహంతో అధికారులపై దాడిచేసి వారి కారును ధ్వంసం చేశారు. తోపులాటలో కార్యకర్తలను అడ్డుకోబోయిన పలువురు పోలీసులకు తీవ్రగాయాలయ్యాయి.

## పానీపూరి తిని 25 మందికి అస్వస్థత



**అక్షరటుడే, గద్వాల:** పానీపూరి.. చాలా మంది ఇష్టంగా తినే చాట్. ముఖ్యంగా అమ్మాయిలు ఎక్కువగా తింటారు. విద్యార్థులు సైతం గప్‌చుప్‌లను ఇష్టంగా లాగిస్తారు. అయితే చాలా మంది పానీపూరి సెంటర్ల వారు పరిశుభ్రత పాటించారు. దీంతో దానిని తిన్న వారు అనారోగ్యం బారీన పడుతారు. గద్వాల జిల్లా అయిజ మున్సిపాలిటీలో పానీపూరి తిని 25 మంది అస్వస్థతకు గురయ్యారు. ఈ ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. కొంతమంది అమ్మాయిలు రాత్రి 7:30 గంటలకు పాని పూరి తినేందుకు వెళ్లారు. అది తిన్న తర్వాత కడుపునొప్పి, వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. దీంతో కుటుంబ సభ్యులు వారిని ఆసుపత్రులకు తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానాకి చేరుకున్నారు. బండిని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ఘటనపై విచారణ చేస్తున్నట్లు ఎస్సై మల్లేష్ తెలిపారు.



దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసిన ఓటర్ల జాబితా సమగ్ర సవరణ (సర్) నిర్వహణపై సుప్రీంకోర్టు తుది తీర్పు వెల్లడిం చింది. అధికార, ప్రతిపక్షాల మధ్య విమర్శలకు దారి తీస్తున్న ఎస్ఐఆర్ ప్రక్రియ చట్టబద్ధమేనని దేశ అత్యు న్నత న్యాయస్థానం తేల్చింది. ఎస్ఐఆర్‌ను నిర్వహించే అధికారం ఎన్నికల కమిషన్‌కు ఉందని స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ చట్టబద్ధతను ప్రశ్నిస్తూ దాఖలైన పిటిషన్లను విచారించిన సుప్రీం ధర్మాసనం బుధవారం ఈ తీర్పు వెలువరించింది.

–అక్షరటుడే, ఢిల్లీ

# సర్‌పై తుది తీర్పు

- ఓటరు జాబితా సవరణ చట్టబద్ధమేనన్న ధర్మాసనం
- విపక్షాలకు ఎదురుదెబ్బ
- ఈసీకి భారీ ఊరట

ఓటర్ల జాబితాలపై ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను చేపట్టే భారత ఎన్నికల సంఘం అధికారాలను సుప్రీంకోర్టు బుధవారం సమర్థించింది. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహించాలనే రాజ్యాంగ లక్ష్య సాధనలో భాగంగానే ఈసీ ఈ చర్యలు తీసుకుందని కోర్టు స్పష్టం చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ మేరకు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎస్ఐఆర్ విధానాన్ని ఉపయోగించడం ద్వారా ఎన్నికల సంఘం తన చట్టబద్ధమైన పరిధిని దాటి వ్యవహరించిందని చెప్పలేమని కోర్టు తేల్చి చెప్పింది. ఇది కేవలం పరిపాలనా సౌలభ్యం కోసం చేసిన ప్రక్రియ కాదని, పారదర్శకమైన ఎన్నికల కోసం తీసుకున్న రాజ్యాంగ ఆవశ్యకత అని ధర్మాసనం పేర్కొంది.

### పిటిషనర్ల అభ్యంతరాలు

రాజ్యాంగంలోని ఆర్టికల్ 326, ప్రజా ప్రాతినిధ్య చట్టం (1950) ప్రకారం ఎన్నికల సంఘానికి ఎస్ఐఆర్ నిర్వహించే విస్తృత అధికారాలు లేవని సవాలు చేస్తూ పలువురు కోర్టులో పిటిషన్లు వేశారు. ఓటర్ల జాబితా సవరణ పేరుతో ఈసీ పౌరసత్వాన్ని ధృవీకరిస్తోందని, ఇది "ఎన్ఆర్‌సీ లాంటి ప్రక్రియ" అని, ఈ అధికారం కేవలం కేంద్ర ప్రభుత్వానికే ఉంటుందని పిటిషనర్లు ఆరోపించారు. అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ అనే ఎన్జీవోతో పాటు దాఖలైన పలు పిటిషన్లపై విచారణ జరిపిన సుప్రీంకోర్టు, గత జనవరి 29న తన తీర్పును రిజర్వ్ చేసింది.

### పౌరసత్వం కోల్పోరు

స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలను 'సర్' ముందుకు తీసుకెళ్తోంది. ఓటర్ల జాబితాల్లో సమగ్రత, కచ్చితత్వం, విశ్వసనీయత ముఖ్యం. ఈ క్రమంలో సర్ నిర్వహణకు ఈసీ చెప్పిన కారణాలతో సంతృప్తి చెందామని తన తీర్పులో ధర్మాసనం పేర్కొంది. 'సర్'లో పేరు లేనంత మాత్రాన ఎవరూ తమ పౌరసత్వం కోల్పోరని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో 'సర్' చుట్టూ గత ఏడాదిగా జరుగుతోన్న రాజకీయ ఆరోపణలు, విమర్శలకు తెరదించినట్లయింది.

### 40 ఏళ్ల క్రితం..

చివరి సమగ్ర సవరణ జరిగి నాలుగు దశాబ్దాలకు పైగా గడిచిపోవడం, ఏళ్లుగా పెద్దఎత్తున చేర్పులు, తొలగింపులు జరగడం, వేగవంతమైన పట్టణీకరణ వలసల కారణంగా ఓటర్ల జాబితాలలో పునరావృతం, తప్పులు ఏర్పడే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది. ఇలాంటి సమయంలో ఎన్నికల సంఘం నమోదు చేసిన కారణాలు, ఆ ప్రాథమిక సమగ్రతను పరిరక్షించడమే లక్ష్యంగా స్పష్టంగా ఉన్నాయని తెలిపింది. ఆధార్ కార్డు, ఓటరు గుర్తింపు కార్డులను పౌరసత్వానికి కచ్చితమైన రుజువులుగా భావించలేమని, అందుకే ఈ సవరణ అవసరమైందని ఈసీ కోర్టుకు తెలిపింది. ఓటర్ల జాబితాలో పేర్లను చేర్చడం లేదా తీసేయడం పూర్తిగా రాజ్యాంగ పరిధిలోని అంశమేనని స్పష్టం చేయగా, సుప్రీం కూడా సమర్థించింది.

## ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**అక్షరటుడే, హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో కూకట్‌పల్లి బస్ డిపోలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ 60 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గ్రీన్ ఛాలెంజ్‌లో భాగంగా ప్రజలకు పర్యావరణహిత ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని తెలిపారు. కాలుష్యాన్ని తగ్గించాలనే లక్ష్యంతో 2027 నాటికి మరిన్ని ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురావాలని ప్రభుత్వం సంకల్పించిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 960 ఎలక్ట్రిక్ బస్సులు నడుస్తున్నాయని, అందులో హైదరాబాద్ నగరంలోనే 545 బస్సులు సేవలందిస్తున్నాయని తెలిపారు. మరో 2,200 ఎలక్ట్రిక్ బస్సులను కేంద్ర ప్రభుత్వ పథకం ద్వారా రాష్ట్రంలో ప్రవేశపెట్టనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ నవీన్, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్ మను చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కేసు




**అక్షరటుడే, హైదరాబాద్ సిటీ:** నాంపల్లి పోలీస్ స్టేషన్‌లో బీఆర్ఎస్ నేత, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌పై కేసు నమోదు అయింది. సింగరేణి ఆస్తులను తగలబెట్టాలంటూ.. మిలి టెంట్ యాక్టివిటీ చేపట్టాలంటూ బాల్క సుమన్ వ్యాఖ్యలు చేశారు. రైలు రోకో నిర్వహించి రైల్వే లైన్‌లను కోసి పారేయాలని రెచ్చగొట్టేలా మాట్లాడారు. దీంతో చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నేతల ఫిర్యాదు చేయగా.. నాంపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ క్రమంలోనే మాజీ ఎమ్మెల్యేపై కేసు నమోదు అయింది. ప్రభుత్వ ఆస్తులను తగలబెట్టాలని సూచించిన ఆయనను పోలీసులు అరెస్ట్ చేస్తారా.. లేదా అనేది చూడాలి.

## కర్ణాటకకు కొత్త ముఖ్యమంత్రి..!



**అక్షరటుడే, బెంగళూరు :** కర్ణాటక రాజకీయాల్లో కీలక పరిణామం చోటు చేసుకోనుంది. ఆ రాష్ట్రానికి త్వరలో కొత్త ముఖ్యమంత్రి రానున్నారు. ప్రస్తుత సీఎం సిద్ధరామయ్య రాజీనామా చేయనున్నట్లు సమాచారం. కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ, ఇతర ముఖ్య నేతలతో సిద్ధరామయ్య, డీకే శివకుమార్ మంగళవారం సుదీర్ఘంగా చర్చించారు. దాదాపు 6 గంటల పాటు వీరి మధ్య సమావేశం జరిగింది. అయితే సమావేశం అనంతరం కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ.. సీఎం మార్పు లేదని ప్రకటించారు. రాజ్యసభ ఎన్నికలపై చర్చించినట్లు తెలిపారు. కానీ తాజాగా కర్ణాటక కాంగ్రెస్ వర్గాలు సీఎం మార్పు ఉంటుందని పేర్కొంటున్నాయి. గురువారం ఉదయ సిద్ధరామయ్య రాజీనామా చేస్తారని, ఈ నెల 30న కొత్త సీఎం ప్రమాణం చేస్తారని సమాచారం. కాగా.. ముఖ్యమంత్రి సిద్ధరామయ్య గురువారం ఉదయం 11 గంటలకు రాజీనామా చేసే అవకాశం ఉందని తెలుస్తోంది.

## అర్ధరాత్రి దంచికొట్టిన వాన.. రైతులకు తీవ్ర నష్టం



**అక్షరటుడే, హైదరాబాద్:** అకాల వర్షాలు అన్నదాతలను ఆగం చేస్తున్నాయి. రాష్ట్రంలోని పలు జిల్లాల్లో మంగళవారం రాత్రి భారీ వర్షం కురిసింది. ప్రధానంగా సిద్దిపేట, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నాగర్‌కర్నూల్, గద్వాల్, నారాయణపేట, నిజామాబాద్, వికారాబాద్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రాత్రిపూట భారీ వర్షాలు కురిశాయి. హైదరాబాద్‌లో కూడా రాత్రంతా విస్తారంగా వర్షాలు కురిశాయి. నగరంలోని మల్కాజ్‌గిరిలో 21.3మి.మీ వర్షపాతం నమోదైంది. అర్ధరాత్రి వర్షం పడడంతో ధాన్యం తడిసి పోయింది. ముఖ్యంగా చాలా ప్రాంతాల్లో వడ్లను కాంటా చేసి సంచుల్లో నింపి ఉంచారు. లారీలు రావడం లేదని కేంద్రాల్లో రోజుల తరబడి ఉంచుతున్నారు. రాత్రి వర్షానికి సంచుల్లో ఉంచిన ధాన్యం తడిసిపోయింది. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆ వడ్లు మొలకెత్తే అవకాశం ఉండటంతో ఆరబెట్టడానికి అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి కాంటా వేసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరుతున్నారు.

## 'హల్లల్లల్లో..' సాంగ్ పాడిందెవరో తెలుసా..!

ప్రస్తుతం యూట్యూబ్‌లో, మ్యూజిక్ స్ట్రీమింగ్ ప్లాట్‌ఫామ్స్‌లో మార్మోగుతున్న సాంగ్ 'హల్లల్లల్లో..'. 'పెద్ది' మూవీలోని ఈ పాటలో రామ్‌చరణ్, శ్రుతి హాసన్, జాన్వీ కపూర్ ఎనర్జిటిక్ మూమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అయితే ఈ సూపర్ సాంగ్‌ని పాడింది ఎవరనేదానిపై చర్చ సాగుతోంది. ఆమెనే సింగర్ రక్షితా సురేశ్. మైసూరుకు చెందిన రక్షిత లెజెండరీ సంగీత దర్శకుడు ఇళయరాజా స్వరకల్పనలో సినిమా సంగీత అరంగేట్రం చేశారు. 'ఎవడే సుబ్రహ్మణ్యం' సినిమాలోని 'చల్లగాలి తాకుతున్న మేఘమైనదీ మనసిలా..' ఆమె తొలి పాట. ఆ తర్వాత 'లవ్‌స్టోరీ'లోని 'ముత్యాల చెమ్మ చెక్క..' పాటను ఆలపించింది. 'జవాన్'లోని 'నాట్ రామయ్యా వస్తావయ్యా..', 'ది లెజెండ్'లోని 'తొలి తొలి ఆశల ఊసులే..' తెలుగు వెర్షన్ల పాటను పాడింది.

–అక్షరటుడే, సినిమాడెస్క్

